క్లుప్తంగా

నేటి నుంచి శ్రీపాపనాశేశ్వర స్వామి ఆలయంలో పూజలు


శ్రీపాపానాశేశ్వర స్వామి ఆలయం

మూసాపేట: మూసాపేటలోని శ్రీపాపనాశేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నుంచి బుధవారం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం విఘ్నేశ్వర పూజ, శ్రీ రుద్ర చండీహోమం, మరో రెండు రోజుల పాటు హోమాలు, ప్రత్యేక పూజలు ఉంటాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి


బస్తీ చలో కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ సుమిత్రనగర్‌లో ఆదివారం బీజేపీ డివిజన్ అధ్యక్షులు డా. ఎన్. వంశీరెడ్డి ఆధ్వర్యంలో వ్యాసశక్తి కేంద్రం ఇన్‌చార్జ్ లలితా రెడ్డి, శక్తి కేంద్రం ప్రముఖ నామాల శ్రీనివాస్, ప్రబావి శ్రీహరి యాదవ్, బూత్ అధ్యక్షులు హరిప్రియ దత్తాత్రేయ సమక్షంలో బస్తీ చలో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా కాలనీలో ఉన్న ప్రధాన సమస్యలుగా ఉన్న డ్రైనేజీ, వృద్ధాప్య పెన్షన్లు, రేషన్ కార్డుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ 11 సంవత్సరాల పాలనపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకొని 11 సంవత్సరాలు వారు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను వివరించారు.

దుండగులను వెంటనే అరెస్టు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఏబీవీపీ కార్యకర్తలు

కూకట్‌పల్లి: విద్యార్థి నాయకుడు సావుల ఆదిత్యపై జూన్ 12 రాత్రి హత్యాయత్నానికి పాల్పడ్డ దుండగులను వెంటనే అరెస్టు చేయాలని ఏబీవీపీ కూకట్‌పల్లి విభాగ్ కన్వీనర్ ఆత్మకూరి శ్రీనాథ్ డిమాండ్ చేశారు. ఆదివారం కూకట్‌పల్లి బస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది కేవలం వ్యక్తిగత స్థాయిలో జరిగిన దాడి కాదన్నారు. ఇలాంటి దాడులకు భయపడేది లేదన్నారు. ఘటన జరిగి మూడు రోజులు గడుస్తున్నా నిందితులను పోలీసులు అరెస్టు చేయకపోవటం అత్యంత దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ బాలకృష్ణ, హైదరాబాద్ మహానగర సంయుక్త కార్యదర్శి భరత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నందు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్



ఓపెన్ జిమ్ పరికరాల పనితీరును పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: హెచ్‌ఏఎల్ కాలనీ పార్కులో సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. ఆదివారం పార్కులో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఓపెన్‌జిమ్, చిన్న పిల్లల ఆట పరికరాలు, పార్కులోని టాయిలెట్స్, మొక్కలను పరిశీలించారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వివిధ సమస్యలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... అధికారులతో చర్చిం మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. డివిజన్‌లో హెచ్‌ఏఎల్ పార్కు ఒక్కటే ఉందని, గతంలో పార్కు అభివృద్ధికి రూ.70 లక్షలతో అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఏఎల్ కాలనీ అధ్యక్షుడు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు కనకదాసు, సెక్రటరీ రాంబాబు, ఉప్పల అశోక్, హరిబాబు, ఆర్‌కే సింగ్, ఎస్ రాజు, జెంషెడ్ హరిబాబు, అశోక్, నాయుడు, నాయకులు మక్కాల సత్యనారాయణ, బాల్‌రాజు, నాగేష్, కృష్ణారెడ్డి, నర్సింహారెడ్డి, పోచయ్య, మట్టి శ్రీను, బుర్రి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అసలే ఇరుకు రోడ్డు..

ఆపై వాహనాల పార్కింగ్!

- కాలనీకి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- రాత్రి వేళ అసాంఘిక కార్యకలాపాలు
- ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులు


ప్రహరీ గోడ వద్ద పేరుకుపోయిన చెత్తా చెదారం, మందు బాటిళ్లు

మూసాపేట: ఆ కాలనీకి వెళ్లాలంటేనే దారి లేక స్థానిక ప్రజలే కాక పాదాచారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు హైటెన్షన్ స్తంభాల క్రింది నుంచి వెళ్లటం, మరోవైపు మున్సిపల్ కార్యాలయం ప్రహరీ గోడ పక్క నుంచి వెళ్లడం. ఒకప్పుడు విశాలమైన రోడ్డు ఉన్న ఈ ప్రాంతంలో మున్సిపల్ కార్యాలయం కోసం విశాలమైన స్థలాన్ని కేటాయించుకొని ప్రహరీ గోడ నిర్మించారు. కాలనీకి వెళ్లేందుకు చిన్నపాటి దారిని వదిలారు. ప్రస్తుతం ఈ దారే స్థానికుల పాలిట శాపంగా మారింది. రాకపోకలకు అంతరాయం కలుగటమే కాక మున్సిపల్ కార్యాలయం పక్కనే అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయి.

చిన్నపాటి రోడ్డుతో తిప్పలు

మున్సిపల్ కార్యాలయం పాత గేటు కాకుండా మరింత స్థలాన్ని కలుపుకుంటూ మెయిన్ రోడ్డు వరకు ప్రహరీ నిర్మించి కొత్త గేటు ఏర్పాటు చేశారు. ఈ ప్రహరీ గోడ నుంచి చిత్తారమ్మ నగర్‌కు వెళ్లేందుకు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు చిన్నగా ఉండటంతో వాహనదారులే కాక పాదాచారులు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ప్రహరీ గోడ పక్కనే కార్లు, ద్విచక్ర వాహనాలు, డీసీఎంలు పార్కింగ్ చేయటంతో ఆ వాహనాలకు అడ్డుగా చేసుకొని పగలు మూత్ర విసర్జన చేస్తున్నారు. రాత్రి సమయంలో మందుబాబులు హల్‌చల్ చేయటమే కాక వ్యర్థాలను అక్కడే వదిలేస్తున్నారు. అర్ధరాత్రి గంజాయి బాబుల ఆగడాలు శృతి మించుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా కేవలం ప్రహరీ గోడను ఆసరాగా చేసుకొని ఇవన్నీ జరుగుతున్నాయి. సాయంత్రం 7 గంటలు దాటిందంటే ఆ రోడ్డు వెంట మహిళలు, చిన్నారులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మున్సిపల్ అధికారులు నిర్మించిన ప్రహరీ గోడ లోపల పబ్లిక్ టాయిలెట్‌ను నిర్మించారు. టాయిలెట్స్‌లో నీరు లేక, పరికరాలు ధ్వంసం కావడంతో ఉపయోగంలో లేదు. గేటు లోపల ఉండటంతో సామాన్య ప్రజలు వెళ్లేందుకు కూడా అవకాశం లేదు. దీంతో గోడ పక్కన మూత్ర విసర్జన చేస్తున్నారు. పక్కనే జిరాక్స్ షాపులు, ఇతర వ్యాపారాలు నడుస్తుండటమే కాక చిత్తారమ్మ, బీరప్ప ఆలయానికి ఈ దారిలోనే వెళ్తుంటారు. చెత్తను వేస్తుండటంతో ఆ ప్రాంత ప్రజలకు దుర్వాసన వస్తుంది.

- పాత గేటు ముందు విశాలమైన స్థలం ఉండటంతో ఈ కాలనీ రహదారి కూడా మూసివేసి మూసాపేట ప్రాంత మహిళలు బతుకమ్మ సంబురాలు జరుపుకునేవారు. కానీ ప్రస్తుతం బతుకమ్మ ఆడుకునేందుకు స్థలం లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా వివిధ పార్టీల నాయకులు, ప్రజలు తమ సమస్యలను విన్నవించుకునేందుకు, ర్నాలు నిర్వహించుకునేందుకు ట్రాఫిక్ ఇబ్బంది లేకండా అప్పట్లో అనుకూలంగా ఉండేది. కాలనీకి విలమైన రోడ్డును అందించటమే కాకుండా అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

> **సమస్యలను పరిష్కరించాలి**
>
> 
>
> గతంలో పాత గేటు వరకు ఉన్నప్పుడు మహిళలు బతుకమ్మను ఎంతో సంబరంగా జరుపుకునేవారు. మున్సిపల్ అధికారులు ప్రధాన రహదారి వరకు ప్రహరీ గోడ నిర్మించి గేటు ఏర్పాటు చేసుకోవటంతో బతుకమ్మ ఆడుకునేందుకు అవకాశం లేదు. అంతేకాకుండా చిత్తారమ్మ బస్తీకి రోడ్డు చిన్నగా అవటమే కాక రాకపోకలకు ఇబ్బందిగా మారుతున్నది. అసాంఘిక కార్యక్రమాలతో ప్రజలు విసిగిపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.
>
> – లాజర్, చిత్తారమ్మ నగర్ వాసి


అధికారులు నిర్మించిన కొత్త గేటు


చిత్తారమ్మనగర్‌కు వెళ్లే ఇరుకుదారి

ఫుట్‌పాత్ ఆక్రమించి.. గది నిర్మించి!


పార్కు సమీపంలో పాఠశాల యాజమాన్యం ఫుట్ పాత్‌పై నిర్మించిన గది

మోతీనగర్: మూసాపేట డివిజన్ బాలాజీ స్వర్ణపురి కాలనీ పార్కు సమీపంలో ఫుట్‌పాత్‌పై ఓ పాఠశాల నిర్వాహకుడు గదిని నిర్మించాడు. పాదాచారులు నడవడానికి ఫుట్‌పాత్‌లు నిర్మించటం సర్వ సాధారణం. అటువంటి ఫుట్‌పాత్‌పై ఏకంగా గదిని నిర్మించి పాఠశాల అవసరాల కోసం వినియోగిస్తున్నారు. ఆ గదిని తొలగించాలని స్థానిక సంక్షేమ సంఘం ప్రతినిధులు జీహెచ్‌ఎంసీ మూసాపేట సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఈ విషయమై జీహెచ్‌ఎంసీ మూసాపేట సర్కిల్ ఏసీపీ కరుణాకర్‌ను వివరణ కోరగా.. సమావేశంలో ఉన్నానని, తరువాత సమాధానం చెబుతానని ఫోన్ పెట్టేశారు.

ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా రేపు చలో ఇందిరాపార్కు


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వామపక్ష నాయకులు

కుత్బుల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కును కాలరాస్తోందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు యూసఫ్ అన్నారు. మంగళవారం ఇందిరా పార్కు వద్ద ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం షాపూర్‌నగర్ ఏఐటీయూసీ కార్యాలయంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ.. మావోయిస్టులు చర్చలకు సిద్ధంగా ఉన్నామని చెబుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఆపరేషన్ కగార్ పేరిట మావోయిస్టులను అంతం చేసి ఖనిజాలను, అడవులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యత్నిస్తోందని ఆరోపించారు. ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, నాయకులు నర్సింహారెడ్డి, వంశీ, జంబూ, లక్ష్మి, సీపీఎం మండల కార్యదర్శి లక్ష్మణ్, నాయకులు శ్రీను, కరుణాకర్, బాషా పాల్గొన్నారు.

క్రీడా పరికరాల అందజేత


క్రీడా పరికరాలు అందజేస్తున్న కార్పొరేటర్ సత్యనారాయణ

కూకట్‌పల్లి: క్రీడల్లో యువతను ప్రోత్సహించడానికి తనవంతు కృషి చేస్తానని కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ అన్నారు. ఆదివారం కూకట్‌పల్లి డివిజన్‌లోని వెల్ఫేర్ అసోసియేషన్ వారికి, యువకులకు క్రీడా పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువకులు క్రీడా పరికరాలను సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణించాలని సూచించారు.

'మనూ' పరిశోధక విద్యార్థి ఫజలుద్దీన్‌కు పీహెచ్‌డీ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని పరిశోధక విద్యార్థి సయ్యద్ ఫజలుద్దీన్‌కు పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ విభాగంలో ఫజలుద్దీన్‌కు పీహెచ్‌డీని ప్రకటించారు. ఆయన మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ విభాగం ప్రొఫెసర్ బదీయుద్దీన్ పర్యవేక్షణలో 'అమ్మకాలు, వ్యక్తిగత శిక్షణ, అభివృద్ధి పద్ధతులు: ఎంపిక చేసిన ఆటోమొబైల్ కంపెనీల అధ్యయనం' అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్‌ను రూపొందించి సమర్పించారు. దీన్ని పరిశీలించి ఆయనకు పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటిస్తున్నట్లు 'మనూ' పరీక్షల కంట్రోలర్ విభాగం వివరించింది.

నూకాంబిక అమ్మవారి మహోత్సవం



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి, వివేకానందనగర్ కాలనీలోని వీఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నూకాంబిక మహోత్సవాల సందర్భంగా నృత్య, లలిత సహస్రనామం, కోలాటం ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కళను కాపాడుతూ వస్తున్న మహిళలను సన్మానించి బహుమతులు అందజేశారు. ఉత్సవాల నిర్వహణకు తనవంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన నేతలు



మూసాపేట: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదినం సందర్భంగా మూసాపేట నుంచి పలువురు ఆయన నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ మూసాపేట డివిజన్ మాజీ అధ్యక్షులు చున్నూ పాష ఆధ్వర్యంలో నేతలు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు కర్క నాగరాజు, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి. చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఆరోగ్య భద్రత


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: సీఎంఆర్‌ఎఫ్ పథకంతో పేదలకు ఆరోగ్య భద్రత కలుగుతుందని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా.. ఆరుగురికి రూ.2.20 లక్షల చెక్కులను కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్‌తో కలిసి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరమన్నారు. ప్రజా క్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, నరేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ వారి జాతర సారె, ఘటాల ఊరేగింపు

ఆల్విన్‌కాలనీ: సాయినగర్‌లోని ఎర్ర పోచమ్మ ఆలయం ప్రాంగణం నుంచి చిత్తారమ్మ ఆలయం వరకు గౌరి సేవా సంఘం వారి ఆధ్వర్యంలో నూకాంబిక అమ్మవారి జాతర సారె, ఘటాల ఊరేగింపు మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, జగద్గిరిగుట్ట సీఐ నర్సింహులు పాల్గొన్నారు.


పీఏసీ చైర్మన్ గాంధీకి షీల్డ్ అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు, పక్కన ఎమ్మెల్యే కృష్ణారావు తదితరులు

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న సభ్యులు

మోతీనగర్: సంక్షేమ సంఘాలు స్థానికంగా ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేయాలని బీజేపీ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు అన్నారు. ఆదివారం అల్లాపూర్ డివిజన్ తులసినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా గెలుపొందిన ఠాకూర్ అంకిత్ సింగ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో చైర్మన్ దండు పాండు యాదవ్, వైస్ చైర్మన్ కిషన్ సింగ్, సలహాదారులు ఆర్. కృష్ణ, ఉపాధ్యక్షులు బి. కిషోర్ కుమార్, కె. శరవన్, జయం, సెక్రటరీ ఎస్. శ్రీధర్, జి. శివ, వై. సంజయ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సదవ్ సింగ్, లీగల్‌సెల్ అడ్వైజర్ కె. సుమలత తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి సేవలందించడంలో ముందుంటాం


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న హాస్పిటల్ ఎండీ డాక్టర్ కమలాకర్, డాక్టర్ లక్ష్మీ కమలాకర్


శిబిరంలో పాల్గొన్న వారు..

కూకట్‌పల్లి: సమాజానికి నిస్వార్థంగా సేవలు అందించడంలో రాందేవ్ ఆసుపత్రి ముందుంటుందని ఆసుపత్రి సీఈఓ డాక్టర్ యోబు అన్నారు. ఆదివారం ఆదరణ ఫౌండేషన్ సహకారంతో రాందేవ్ రావ్ ఆసుపత్రిలో 1 నుంచి 16 సంవత్సరాలలోపు పిల్లలకు ఉచితంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరాన్ని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్, డాక్టర్ లక్ష్మీ కమలాకర్‌లు అతిథులుగా హాజరై ప్రారంభించారు. జనరల్ స్క్రీనింగ్, ఐ చెకప్, ఇతర వ్యాధులను గుర్తించడానికి రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. పిల్లల వైద్య శిబిరానికి ఆదరణ ఫౌండేషన్ సహకారం అందించినందుకు ఫౌండేషన్ అధ్యక్షులు అరిగెల రఘునాథ్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు సునీత, శృతి, మణి, ప్రశాంతి, సుమిత్ర, కల్పన మంతెన, లీలా, సృజన, ఫౌండేషన్ కోశాధికారి భాను వరకుమార్, ప్రధాన కార్యదర్శి పి. మేరీ జోన్స్, ఎ. అనిషా, సన్నీ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నల్లగండ్ల చెరువు 'క్లీనప్ డ్రైవ్'


క్లీనప్ డ్రైవ్‌లో పాల్గొన్న ఎన్‌సీఆర్ వోయిక్స్ వలంటీర్లు

శేరిలింగంపల్లి: నల్లగండ్లలోని చెరువును క్లీనప్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఎన్‌సీఆర్ వోయిక్స్ సీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా కార్యక్రమాన్ని సంస్థ వలంటీర్లు ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొని చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా 21.1 కిలోల గాజు సీసాలు, 1.5 కిలోల ప్లాస్టిక్ సీసాలు, వివిధ వ్యర్థాలు 113.7 కిలోలు, ఇలా మొత్తం 136.3 కిలోల వ్యర్థాలను తొలగించారు. చెరువు పరిసరాల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వలంటీర్లు పేర్కొన్నారు.

నృత్యం.. నయన మనోహరం


నృత్యం చేస్తున్న కళాకారులు

మాదాపూర్: కళాకారులు కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం బెంగుళూరికి చెందిన భరతనాట్య కళాకారిణి ఐశ్వర్య ఎం నాయర్ తన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఈశానకౌతం, శంకరశ్రీగిరి, శివకామ సుందరి అంశాలను ప్రదర్శించి మెప్పించారు. రుహాణి కూచిపూడి డాన్స్ అకాడమీ కల్పన శిష్య బృందంచే కూచిపూడి నృత్యప్రదర్శనలో భాగంగా మహాగణపతి, కొలువైతివారంగసాయి, భాగ్యదా లక్ష్మి, అచ్యుతం కేశవం, శివస్తుతి, జనుతశబ్దం, అలరులు కురియగా, భామాకలాపం, అంశాలను కళాకారులు హారిక, శారద, రాజేశ్వరీ, దీప్తి, శిరీష, మోక్ష, అద్యారావు, సితార, దేవిక, భవ్యశ్రీ, శ్రీతన్వి, ఈషా, నేహా, అపూర్వ తదితరులు పాల్గొని ప్రదర్శించారు.

